బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



రామంతాపూర్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రామంతాపూర్ : విద్యుదాఘాతంతో మృతి చెందిన ఐదుగురు ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ.. స్థానిక యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామంతాపూర్ ప్రధాన రహదారి నుంచి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. శనివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, భేతి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. కోటి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి వారిని అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహేందర్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, పాండుయాదవ్, వెంకటేష్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్, సర్వబాబుయాదవ్‌తో పాటు టీఆర్ఎస్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌ముదిరాజ్ సూచించారు. డివిజన్‌లోని ప్రశాంత్‌నగర్‌లో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. బన్నాల ప్రవీణ్, జీహెచ్ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్‌గా ప్రకాష్‌గౌడ్

ఉప్పల్: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ కన్వీనర్‌గా ఎల్లగోని ప్రకాష్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈ మేరకు ఉప్పల్‌లో వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవ సమితి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ చల్ల ప్రభాకర్, గౌరిగే కృష్ణ, రావుల బాలకృష్ణ, బొంగు రమేష్‌గౌడ్, రేవల్లి రాజు, దేవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు వరంగా రాజీవ్ కల్యాణ మండపం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్ దళితవాడలో రూ.1.27 కోట్లతో నిర్మిస్తున్న రాజీవ్ కల్యాణ మండపాన్ని స్థానికులు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డిలు పరిశీలించారు. సాధ్యమైనంత త్వరలో కల్యాణ మండపాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని కార్పొరేటర్ శనివారం తెలిపారు. డీఈ విసీల్‌గౌడ్, స్థానిక నేతలు లింగపల్లి రామకృష్ణ, బాకారం లక్ష్మణ్, ఏసూరి యాదగిరి, సల్లా ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలని వినతి

మల్లాపూర్: నాచారం పరిధిలోని పోచమ్మ గుడి అన్నపూర్ణ కాలనీ పార్క్ రోడ్డు వరకు సీసీరోడ్డు వేయాలని కోరుతూ శనివారం కాలనీవాసులు నాచారం కార్పొరేటర్ శాంతికి వినతిపత్రం అందజేశారు. అధికారులతో మాట్లాడి రోడ్డు వేయిస్తామని వారికి కార్పొరేటర్ హామీ ఇచ్చారు. యాదగిరి, మారయ్య, అశోక్, యాదగిరి, పెంటయ్య, ప్రభాకర్, రాజ్‌కుమార్, లక్ష్మణ్, శ్రీనివాసచారి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నాలాల్లో పూడికను తొలగించండి



డీసీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని నాలాల్లో పూడికను తొలగించాలని బీజేపీ సీనియర్ నాయకుడు బక్క నాగరాజు స్థానికులతో కలిసి శనివారం సర్కిల్ డీసీ జకియా సుల్తానాకు వినతిపత్రం అందజేశారు. నాగరాజు మాట్లాడుతూ.. వసంతపురికాలనీ, సత్తిరెడ్డినగర్, దుర్గానగర్ ప్రాంతాల్లో నాలాల్లో పూడిక తొలగించలేదన్నారు. దీంతో చిన్నపాటి వర్షానికే కాలనీల్లో వరద నీరు ముంపు బారిన పడాల్సి వస్తుందన్నారు. నాలాలో చెత్త, చెదారం వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. విఠోబా, దేవదాసు, రాఘవేంద్రస్వామి ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రణాళిక కొరవడి.. ప్రగతి మొక్కుబడి

పురపాలికల్లో వంద రోజుల కార్యక్రమం తీరిది

- జూన్ 2 నుంచి మొదలై.. సెప్టెంబర్ 10 వరకూ..
- ప్రణాళికను పట్టించుకోని పురపాలక కమిషనర్లు
- మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 34 పురపాలికలు



పోచారంలో బురదమయంగా రోడ్డు..

సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణ, వివిధ అభివృద్ధి పనులు, స్వశక్తి సంఘాల ఆర్థికాభివృద్ధి తదితర కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించేలా ప్రభుత్వం 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. 'ఒక మార్పు.. అభివృద్ధికి మలుపు' నినాదంతో రోజుకో కార్యక్రమం నిర్వహణకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. జూన్ 2 నుంచి సెప్టెంబర్ 10 వరకు వంద రోజుల ప్రణాళిక కార్యక్రమం కొనసాగనుండగా.. ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోవడంతో మొక్కుబడి తంతుగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారుల సమన్వయ లోపం..

పురపాలికల్లో నిధుల కొరతకు తోడు అధికారులు మధ్య సమన్వయ లోపం, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 34 పురపాలక సంఘాల పరిధిలో కార్యక్రమం ప్రారంభమై 82 రోజులు గడిచినా.. పనులు నామమాత్రంగా సాగుతున్నాయి. మిగిలిన 18 రోజుల్లో స్పెషల్ ఆఫీసర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తేనే పూర్తిస్థాయి లక్ష్యం నెరవేరనుంది. 100 రోజుల ప్రణాళికలో ఎక్కువగా పారిశుద్ధ్యంపైనే పుర అధికారులు దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి, ఆదాయంపై కనిపించని పురోగతి

తడి, పొడి, హానికర చెత్త వర్గీకరణపై మహిళలకు అవగాహన సదస్సులు, ర్యాలీల నిర్వహణ పూర్తిస్థాయిలో జరగడం లేదు. నల్లాల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. మహిళలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయడంతో పాటు హోం ఫుడ్ తయారీపై ప్రదర్శనలు నిర్వహించారు. రోడ్ల మరమ్మతులు, వీధిలైట్లు, వనమహోత్సవం, మురికి కాల్వల పరిశుభ్రత, దోమల నివారణకు ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కల తొలగింపు, కుక్కల నియంత్రణ, ఇంటి నెంబర్లు, అనుమతిలేని కట్టడాలు, ట్రేడ్ లైసెన్స్‌లు, కూడళ్లు, ఉద్యానవనాల తదితర వాటి అభివృద్ధి, ఆదాయం పెంపుపై ఏమాత్రం దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. పలువురు ఉద్యోగులు, సిబ్బంది వంద రోజుల ప్రణాళిక పక్కన బెట్టి సొంత వ్యాపకాలపై ప్రత్యేక చర్యలకు పూనుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్షాలతో దెబ్బతిన్న రహదారులు

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారులు దెబ్బతిన్నాయి. అంతర్గత రోడ్లు మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. తడి, పొడి చెత్త కూడా వేర్వేరుగా సేకరించడం లేదు. కాలనీల్లో డ్రైనేజీలు లేక పారిశుద్ధ్యం లోపిస్తోంది. రోడ్ల పక్కను చెత్తను డంప్ చేయడం వల్ల వాహనచోదకులు దుర్వాసన భరించలేకపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- పోచారం మున్సిపాలిటీ పరిధిలో ఓఆర్ఆర్‌కు ఆనుకుని సర్వీస్ రోడ్డు పక్కన అనాధికారికంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌లోని చెత్త, కాల్చుతున్న మంటలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల కొరతతో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు.
- ఘట్‌కేసర్, బోడుప్పల్, పోచారం, జవహర్‌నగర్ తదితర పురపాలక సంఘాల్లో కూడళ్ల అభివృద్ధి చేపట్టకపోవడంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి.
- శివారు కాలనీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో మట్టి, మొరం రోడ్లపైనే వరద నీరు నిలవడంతో పాటు మురుగు కాల్వలు లేక బురదమయంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. శివారు కాలనీల్లో మురుగు నిలిచి దోమల బెడద అధికమవుతోంది. పాత మురికి కాల్వలు దెబ్బతిన్నా.. నిధులు లేకపోవడంతో కొత్తవి నిర్మించడం లేదు.

తాగునీటి సమస్య..

పురపాలికల్లోని పలు కాలనీల్లో తాగునీటి సమస్య నెలకొంది. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం లేకపోవడంతో ఉద్యానవనాల నిర్మాణాలు చేపట్టడం లేదు. పోచారంతో సహా పలు పురపాలక సంఘాల్లో వీధిలైట్ల సమస్య తీవ్రంగా ఉంది.

తరచుగా రోడ్డు ప్రమాదాలు

ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు ఉన్న హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిలో వీధిలైట్లు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ఈ రహదారిలో ఫ్లై ఓవర్ రోడ్డు పనులు జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళకు గురౌతున్నారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీల్లో ప్రజలు ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, చెత్త, చెదారం, డంపింగ్‌యార్డు, తాగునీరు, పార్కుల వంటి అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణ కొరవడటంతోనే ఈ సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కాప్రా సర్కిల్‌లో కుంగిపోయిన రహదారి..

మౌలిక వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: 15 డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామన్నారు.

లక్ష యూనిట్ల రక్త సేకరణ గొప్ప విషయం



బ్రహ్మకుమారీస్ ధ్యాన కేంద్రం రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: లక్ష యూనిట్ల రక్త సేకరణ చేపట్టడం గొప్ప విషయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రశంసించారు. రాజయోగిని దాది ప్రకాశమునిని స్మరించుకుంటూ బ్రహ్మకుమారీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన లక్ష యూనిట్ల రక్త సేకరణలో భాగంగా శనివారం మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ బ్రహ్మకుమారీస్ రాజయోగ ధ్యాన కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాణాప్రాయస్థితిలో ఉన్న వారికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ధ్యానకేంద్రం ఇన్‌చార్జి బీకే.సునీత, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్, మల్లేష్‌గౌడ్, ఇక్బాల్, శివరాంప్రసాద్, గోవిందరెడ్డి, ప్రతాపరెడ్డి, దేవేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



నాగోల్ మెట్రోస్టేషన్ రహదారిలో పొంగుతున్న మురుగును చూపుతున్న స్థానికులు

ఉప్పల్: రామంతాపూర్ కేసీఆర్‌నగర్ నుంచి నాగోల్ మెట్రోస్టేషన్‌కు వెళ్లే మార్గంలో నెలల తరబడి మురుగు పొంగుతున్నా.. వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజావాణి స్వచ్ఛంద సంస్థ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజావాణిలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ మేరకు శనివారం స్థానికులు, ప్రమాదం బారిన పడిని వారితో కలిసి ఘటనా స్థలం వద్ద నినాదాలు చేశారు. సత్వరమే సమస్యకు పరిష్కరించకుంటే జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మల్కాజిగిరి: వినాయకచవితి పర్వదినం, నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని మల్కాజిగిరి జోన్ ఏసీపీ చక్రపాణి అన్నారు. శనివారం మల్కాజిగిరి శ్రీ శుభం ఫంక్షన్‌హాల్‌లో మల్కాజిగిరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు, మండప నిర్వాహకులు, భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ.. చిన్న విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాల ఏర్పాటుపై నిర్వాహకులు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని సూచించారు. దీనివల్ల గణేష్ నవరాత్రులతో పాటు నిమజ్జన సమయంలో ఇబ్బందులు లేకుండా చూడడానికి అవకాశం ఉంటుందన్నారు. మండపాల వద్ద తగిన భద్రతాచర్యలు తీసుకోవాలని చెప్పారు. మండపం దగ్గర సౌండ్ పొల్యూషన్ లేకుండా చూడాలని వివరించారు. కార్పొరేటర్ శ్రవణ్, సర్కిల్ డీసీ జకియా సుల్తానా, డీఐ శ్రీశైలం, ఎస్సైలు శంకర్, గణేష్, ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల తదితరులున్నారు.

మండప నిర్వాహకులకు పోలీసుల సూచనలు..

అల్వాల్: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా నేరేడ్‌మెట్‌లోని మహాబోధి ఫంక్షన్‌హాల్‌లో నేరేడ్‌మెట్ పోలీసులు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండపాల వద్ద చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రూ.3.45 కోట్లతో నాలా పనులు !



నాలా వివరాలను అడిగి తెలుసుకుంటున్న మాజీ మేయర్

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీసాయిరాంనగర్ కాలనీలో చేపట్టనున్న బాక్స్ డ్రెయిన్ పనులను శనివారం కమిషనర్ శైలజ, మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. సాయిరాంనగర్ నుంచి సుద్దకుంట వరకు రూ.3.45కోట్లతో పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ పనులు పూర్తైతే రా చెరువు నుంచి నల్ల చెరువు వరకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు సుమన్‌నాయక్, సీసా వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రామంతాపూర్: పాలిటెక్నిక్ కాలేజ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మధురానగర్, శ్రీనివాసపురం కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ లావణ్య కోరారు.

మల్లాపూర్: 33/11 కేవీ మల్లాపూర్ నోమా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ అన్నపూర్ణ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

నాచారంలో...

33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం పలు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మల్టీస్టీల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు నాచారం ఐడీఏ రోడ్ నెంబర్ 07,08 విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. 11 కేవీ చందమామ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాచారం ఐడీఏ రోడ్ నెంబర్ 09,10 చందమామ ప్రెస్‌లైన్, 11కేవీ దుర్గానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కేవీ టైమ్స్ ఆఫ్ ఇండియా ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండదన్నారు. 11 కేవీ నాగార్జున ఫెర్టిలైజర్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, 11 కేవీ ఇనోజెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. 11 కేవీ జీవీకె ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి 11.30 వరకు, 11 కేవీ హరియాణా స్టీల్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్ 12,15లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వివరించారు.

పార్కు అభివృద్ధికి కృషి చేస్తా

కాప్రా: డీఆర్ఎల్ ఎన్‌క్లేవ్ కాలనీలో పార్కు అభివృద్ధికి కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి తెలిపారు. పార్కు అభివృద్ధిలో భాగంగా శనివారం బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీరోడ్లు, బాక్స్ డ్రెయిన్ వంటి పనులు చేపట్టి డీఆర్ఎల్ ఎన్‌క్లేవ్‌ను అభివృద్ధి చేశానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్క్‌ను కూడా సుందరీకరించి కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకొస్తానని హామీ ఇచ్చారు. యూబీడీ మేనేజర్ లోకేష్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

నాచారం భాగ్యనగర్ గణేష్ ఉత్సవ నూతన కమిటీ

మల్లాపూర్: నాచారం భాగ్యనగర్ ఉత్సవ సమితి పూర్తి కమిటీని శనివారం నాచారం శాఖా కన్వీనర్‌గా నమిలికొండ సునీల్‌రెడ్డి ప్రకటించారు. కో- కన్వీనర్స్‌గా ఎరుకల సాయిగౌడ్, మామిడాల సంతోష్‌రెడ్డి, బాలకృష్ణ, కో-ఆర్డినేటర్లు కిశోర్, ప్రభాకర్, రేవంత్, సందీప్‌లతో కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు.

వ్యక్తి అదృశ్యం



వేముల నరేష్

మేడిపల్లి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి గణేష్‌నగర్‌లో నివాసం ఉంటున్న వేముల రూప, భర్త వేముల నరేష్‌లు గత నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నారు. గత కొద్ది నెలలుగా భర్త ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ.. డబ్బులను పోగొట్టుకున్నాడు. దీంతో ఆమె డబ్బుల విషయంపై భర్తను నిలదీయగా.. ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో భర్త నరేష్ 21న ఉదయం ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థుల ర్యాలీ



ఈసీఐఎల్‌లో ర్యాలీ చేపడుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

కుషాయిగూడ: 'వరల్డ్ స్పేస్ డే' సందర్భంగా ఈసీఐఎల్‌లోని సాయి సుధీర్ పీజీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో స్పేస్ సాధించిన విజయాల గుర్తు చేసుకుంటూ నినాదాలు చేశారు. అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ విజయ్ నేతృత్వంలో కొనసాగింది.

గణేష్ నవరాత్రులపై ఎమ్మెల్యే సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: గణేష్ ఉత్సవాలను ఉప్పల్ నియోజకవర్గంలో ప్రశాంతవంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఏఎస్‌రావునగర్ డివిజన్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ అధ్యక్షతన పోలీస్, ఆర్అండ్‌బీ, ఆరోగ్య, విద్యుత్‌శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సలహాలు, సూచనలు తీసుకుంటూ.. సమస్యలు పరిష్కరించుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్ రెడ్డి, చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, హెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్యలు పరిష్కరించాలి



జీహెచ్ఎంసీ ఈఈకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ సునీత

మౌలాలి : అధ్వాన్నంగా మారిన రహదారులకు తక్షణం మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మణ్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీమార్ట్ రోడ్డు, ఎంజేకాలనీ, సాయినాథపురం, గాంధీనగర్, ఆర్టీసీ కాలనీ, డీపీఏ స్కూల్ మెయిన్‌రోడ్డు, ఆర్కేహెచ్ సిలికాన్ బేకరీ రోడ్డు తదితర రహదారులు గుంతలు పడి అధ్వాన్నంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే గణేష్ నవరాత్రి వేడుకలు, శోభాయాత్రలు జరుగుతాయని, గణపతుల ఆగమనం, నిమజ్జనం తదితర కార్యక్రమాలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. తక్షణమే ఇంజినీరింగ్ అధికారులతో పాటు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ఆయా రహదారులకు మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని కోరారు. జీహెచ్ఎంసీ ఈఈ లక్ష్మణ్ సానుకూలంగా స్పందించారని కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ తెలిపారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



ఈసీఐఎల్‌లో..

బోడుప్పల్: ఇందిరానగర్ చౌరస్తా వద్ద సీపీఐ అగ్రనేత సుధాకర్‌రెడ్డికి మేడిపల్లి మండల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చకిషన్ మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి జీవితకాలం పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మండల సహాయ కార్యదర్శులు మాధవి, నాగరాజు, బీసీ జిల్లా అధ్యక్షులు బాపిరాజు, ప్రమీల, మహాలక్ష్మి, ఐలయ్య, అన్వర్, నర్సమ్మ, ఇస్తారి, సోమరాజు, అండాలు పాల్గొన్నారు.

సురవరం మరణం తీరని లోటు..

కాప్రా: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మరణం వామపక్ష, ప్రజాస్వామ్య ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. శనివారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పార్టీ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బోస్ మాట్లాడుతూ.. సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలు ముగిసిన కొద్ది నిమిషాలకే సురవరం మరణవార్త విని పార్టీ నాయకులంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఆయన నేతృత్వంలో పనిచేసిన అనేక మంది విద్యార్థి, యువజన నాయకులు తరువాతి కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు దామోదర్‌రెడ్డి, ధర్మేంద్ర, శంకర్‌రావు, సత్యప్రసాద్, లక్ష్మీనారాయణ, సాయిలు, శ్రీనివాస్, స్వామిదాస్ పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించాలి



కాప్రా: సమాజంలో వృద్ధుల కృషి, వారి విజయాలను గౌరవించాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా న్యాయసేవ అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా ఏఎస్‌రావునగర్‌లో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్లు సమాజానికి ఎంతో విలువైన జ్ఞానం అందిస్తారని, వారి అనుభవాలు, ఎదుర్కొన్న సమస్యలు గుర్తించడానికి సీనియర్ సిటిజన్స్‌డే నిర్వహించుకుంటామని పేర్కొన్నారు. అనంతరం కిరణ్‌కుమార్‌ను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు.